

సురేష్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నర్సింగరావు, తదితరులు

సురేష్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మంచి నాయకునిగా పేరొందిన అనకాకొండ సురేష్ అకాల మరణం కార్మిక వర్గానికి తీరని లోటని సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. కార్మిక నాయకుడు సురేష్ సంతాప సభ కెవిపి.చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ సురేష్ మరణంతో కార్మికలోకం దిగ్భ్రాంతి చెందిందన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం చేస్తూ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్‌లో రాష్ట్ర కోశాధికారిగా ఎనిమిది సంవత్సరాలు పనిచేశారన్నారు. విశాఖలో పౌర సంక్షేమ సంఘం, వార్తా లాంటి సంస్థలలో నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంతాప సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, జివి.రమణ, సంతోష్ కుమార్, గుర్రం రమణ, టి.కామేశ్వరరావు, మణి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో కనక మహాలక్ష్మి బ్యాంక్



ఖాతాదారులను సన్మానిస్తున్న తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిన్న, మధ్యతరహా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా తమ బ్యాంకును స్థాపించినట్టు కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు తెలిపారు. అన్ని రంగాల వారికి అనుగుణంగా అధునాతన బ్యాంకు సేవలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా మురళీనగర్ శాఖ ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్ళు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికి వివిధ జిల్లాల్లో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. రానున్న కాలంలో మరో ఐదు నూతన శాఖలను నెలకొల్పుతున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,400 మంది సభ్యులతో రూ.32 కోట్లు వాటా ధనం పొంది అర్బన్ కో-ఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, ఒఎస్‌డి శాస్త్రి, మురళీనగర్, పెందుర్తి శాఖల మేనేజర్లు జి.శ్రీదేవి, ఎ.నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ ఖాతాదారులను సత్కరించారు. .

ముఖం చాటేసిన మోడీ

◆ విశాఖకు రావాలంటూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతల పట్టు ◆ తోసిపుచ్చిన కేంద్రం

◆ అడుగు పెడితే నిరసనలుంటాయని హెచ్చరించిన ఇంటెలిజెన్స్



ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈసారీ ప్రధాని నరేంద్రమోడీ విశాఖకు రావడం లేదు. ఆయన ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్రంలోని కొన్ని చోట్ల పర్యటనకు వస్తున్నారు. వాస్తవానికి 15న విశాఖలో మోడీ రోడ్ షో, బిజెపి సభ నిర్వహించాలని ఆ పార్టీ నేతలు భావించారు. కానీ ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఆయన ఇక్కడకు రావడం లేదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ వంటి అంశాలపై ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు తీవ్ర ఆవేదనతో ఉన్నారన్న సమాచారాన్ని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు పైకి పంపాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేస్తేనే విశాఖలో మోడీని అడుగుపెట్టనిస్తామంటూ ఇప్పటికే పలుమార్లు స్టీల్ కార్మికులు ప్రకటన చేశారు. మోడీ పర్యటన వాయిదా వేయాలని, లేదంటే వామపక్ష, ప్రజా, కార్మిక సంఘాల నేతలను ముందస్తు అరెస్టులైనా చేసి విశాఖకు రావాలని ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారం ఇచ్చినట్టు భోగట్టా.

అసలేం జరిగిందంటే...

2014 ఎన్నికల్లో బిజెపి, టిడిపి మధ్య ఎన్నికల పొత్తుతో ఈ రెండు పార్టీలు కలిసే రాజకీయ వేదికలు పంచుకున్నాయి. ఆ తర్వాత 2019 ఎన్నికల నాటికి పరిణామాలు మారిపోయాయి. వివిధ తరగతుల ప్రజానీకం నుంచి టిడిపిపై ఏపికి ప్రత్యేక హోదా అంశంపై వచ్చిన ఒత్తిడితో ఆ పార్టీ బిజెపితో తెగతెంపులు చేసుకుని పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో ఓటమి చెందింది. తిరిగి ఇప్పుడు బిజెపి, జనసేనలతో టిడిపి జతకట్టింది. ఈసారి కేంద్రంలోని బిజెపి అండతో రాష్ట్రంలో పాగా వేయాలని బాబు, పవన్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మోడీ ద్వారా కొంతమేర ప్రచారం సాగించి రాజకీయ లబ్ధి పొందాలని, మోడీ తమకు అండగా ఉన్నారని చెప్పుకోవాలని భావించి విశాఖలో సభ ఏర్పాటు చేయాలనుకున్నారు. ఈ మేరకు మోడీ విశాఖకు రావాలని ఈ రెండు పార్టీల అధినేతలు పట్టుబట్టినా సరే ఈ దఫా ఇక్కడ పర్యటన ఉండదని కేంద్రం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా 15న విశాఖలోని రైల్వే గ్రౌండ్స్‌లో సభ జరుగుతుందని తొలుత విశాఖ బిజెపి నేతలు లీకులు వదిలారు. తర్వాత పర్యటనపై మౌనం దాల్చారు.

టిడిపి కార్యాలయంలో తగ్గిన హడావుడి

రెగ్యులర్‌గా విశాఖ టిడిపి కార్యాలయం నుంచి కనీసం నాలుగు ప్రెస్‌మీట్‌లైనా ఉండేవి. ప్రస్తుతం ఆ హడావుడేదీ కానరావడం లేదు. మూడు రోజుల నుంచీ ఇదే స్థితి. టిడిపి, జనసేన నేతలెవ్వరూ బిజెపితో పొత్తు గురించి చర్చించేందుకు సిద్ధపడడం లేదు.

ద్రోహం చేసిన బిజెపితో పొత్తా ?

◆ ఆ పార్టీతో జతకట్టి ఉమ్మడి విశాఖ జిల్లాను ఎలా పరిరక్షిస్తారు ?

◆ టిడిపి, జనసేనలు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

◆ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్రానికి అన్నింటా తీవ్ర ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జతకట్టడం దారుణమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎవరి ప్రయోజనాలను రక్షించటానికి బిజెపితో జతకడుతున్నారని ప్రశ్నించారు. ప్రజా ధనాన్ని దోచుకున్న సొమ్మును లూటీచేసిన వారు బిజెపి తరపున అభ్యర్థులుగా పోటీ చేస్తుంటే వారిని సమర్థించటం ఎంత వరకు సమంజసమో ప్రజలకు టిడిపి, జనసేన పార్టీలు బహిరంగంగా చెప్పాల్సి ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, వారి మిత్రపక్షాలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మూడేళ్లకు పైబడి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను పోర్టుల్ని స్టీల్‌ప్లాంటును రక్షిస్తామని జనసేన, తెలుగుదేశం పార్టీల అధినేతలు చెప్పిన మాటలన్నీ నేడు అవాస్తవాలని పొత్తు ద్వారా రుజువవుతున్నాయని అన్నారు. బిజెపితో జత కట్టడమంటే విశాఖ ప్రజలకు తీవ్రమైన ద్రోహం చేసినట్లేనని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పదేళ్ళ నుండి ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు ముఖ్యంగా విశాఖపట్నం ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని తెలిపారు. విశాఖ మెట్రో రైలుకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. రైల్వేజోన్ ఇవ్వకుండా కుంటిసాకులు చెబుతున్నారన్నారు. గంగవరం పోర్టును అదానీకి అప్పజెప్పడంలో కేంద్ర బిజెపి కీలకంగా వ్యవహరించిందని వెల్లడించారు. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేసి అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తోందన్నారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో అదానీ కంపెనీలకు పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారన్నారు. జీవో నెంబర్ 3ని రద్దు చేసి గిరిజనులకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వకుండా ఏజెన్సీ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ఏ అంశాన్నీ అమలు చేయకుండా ద్రోహం చేసిందని తెలిపారు. అలాంటి బిజెపితో జతకట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని, ముఖ్యంగా ఉత్తరాంధ్రను, స్టీల్‌ప్లాంట్‌ను బలిచేయాలని చూడటం తగదన్నారు. రాజకీయంగా వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి ప్రజల మద్దతు కూడగట్టాల్సింది పోయి ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపితో జతకట్టడం సరైనది కాదన్నారు. ఇదే విధానాలతో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఎన్నికలకు వెళ్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్‌పిటిసి సభ్యులు

పనుల బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలి

- జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో భీశెట్టి వరాహ సత్యవతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలని జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు భీశెట్టి వరాహ సత్యవతి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్‌లో 1 నుండి 7 వరకూగల స్థాయీ సంఘ సమావేశాలు విడివిడిగా జరిగాయి. వీటికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అభివృద్ధి దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చూడాలన్నారు. గరిష్ట దినసరి వేతనం అందేలా చర్యలు చేపట్టాలని డ్వామా అధికారులను ఆదేశించారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో చేసే వైద్య పరీక్షలకు సంబంధించి ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్లకు విద్యుత్ మోటార్లు పెట్టి అక్రమంగా నీటి చౌర్యం చేస్తున్నట్లు సభ్యులు లేవనెత్తిన అంశాలపై వారంలోగా నివేదిక సమర్పించాలని జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయుడు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశాలలో వివిధ శాఖ అధికారులు వారి వారి శాఖలకు చెందిన ప్రగతి నివేదికలను సభ్యులకు తెలియజేస్తూ గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పాశర్ల ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసిన పాశర్ల ప్రసాద్ తన సతీమణి 72వ వార్డు మాజీ కార్పొరేటర్ వసంత కల్యాణితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాదులో పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సమక్షంలో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ విశాఖ జిల్లా అధ్యక్షులు గొంప గోవిందరాజు పాల్గొన్నారు. ప్రసాద్ గతంలో అడవివరం గ్రామ సర్పంచిగా, శ్రీ సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యునిగా పనిచేశారు.

ఉత్సాహంగా 'పెయింట్ మై స్ట్రీట్ ఛాలెంజ్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎకో వైజాగ్ కార్యక్రమాలలో భాగంగా విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల అవగాహన కోసం ప్రతి వార్డులో 'పెయింట్ మై స్ట్రీట్' ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సిరిపురం జంక్షన్ ఆలిండియా రేడియో స్టేషన్ సమీపంలో 'పెయింట్ మై స్ట్రీట్' ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేంజర్ ఫోర్స్ ఎన్జీవో సౌజన్యంతో, ఫ్లూయెంట్ గ్రిడ్ సహకారంతో 'పెయింట్ మై స్ట్రీట్' ఛాలెంజ్ కార్యక్రమాన్ని మొదటి విడతగా 2500 చదరపు అడుగుల గోడలపై సందేశాత్మకమైన చిత్రాలతో ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువత, పిల్లలు సుమారు 200 మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

విలేకరులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు ఎన్నికల ప్రక్రియపై క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై విలేకరులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రెస్ మీడియా పాత్ర చాలా కీలకమని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను అనుసరించి మీడియా వారు నడుచుకోవాలని సూచించారు. మీడియా వారికి ఎన్నికల సమాచారాన్ని తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ వారిచే అథారిటీ లెటర్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మీడియా నిబద్ధతతో పనిచేయాలని, ఎలక్షన్ అధికారులకు వాస్తవాలను తెలిసే విధంగా ప్రసారాలు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసిఎంసి కమిటీ నోడల్ అధికారి జివి.లక్ష్మి, డిపిఆర్‌ఓ డి.సాయిబాబా, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం పర్యవేక్షణకులు డి.రామ్మూర్తి పాల్గొన్నారు.

లోకేష్ దృష్టికి అనకాపల్లి పరిణామాలు



లోకేష్‌తో మాట్లాడుతున్న నాగజగదీష్


ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి అధినేత చంద్రబాబు నివాసంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అనకాపల్లి పరిణామాలను వివరించారు. ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అందర్నీ సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తున్నారని లోకేష్‌కు తెలియజేశారు. 17న చిలకలూరుపేటలో జరుగు బహిరంగ సభకు పార్టీ శ్రేణులను తరలించడానికి 11 మందిలో ఏర్పాటు చేసిన రవాణా శాఖ కమిటీలో తనను నియమించినట్లు నాగ జగదీష్ తెలిపారు.

గ్రామాల్లో వైసిపి నేత భరత్ కుమార్ పర్యటన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం, జోగారావుపేట గ్రామాల్లో మేము సిద్ధంలో భాగంగా వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మంగళవారం పర్యటించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, నాయకులు వజ్రం నాగ శీను పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన టిడిపి, జనసేన శ్రేణులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డు పరిధి బొగ్గవరపు వారి వీధిలో ఆ వార్డు ఇన్చార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారు వైసిపిలో మంగళవారం చేరారు. వైసిపి నియోజవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, కారుకొండ కన్నబాబు, మాధురి నాయుడు, ఏడాకుల నారాయణరావు, కోరుకొండ రమేష్, ఉమ్మడి పైడిరాజు, కేతిరెడ్డి ప్రసాద్, పిల్లల శివ అప్పారావు, పూడి సూరిబాబు, చింతలపూడి వాసు పాల్గొన్నారు.



భరత్ కుమార్ సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి, జనసేన కార్యకర్తలు

మహిళలపై హింసను అరికట్టాలి

ఐద్వా ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

ప్రజాశక్తి - యలమంచిలి : మహిళల మీద పెరుగుతున్న హింసను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం విజ్ఞప్తి చేశారు. స్థానిక మున్సిపల్ పరిధి శ్రీరామ్మూర్తి నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ మద్యాన్ని నిషేధించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బాల్య వివాహాలను, వరకట్న వేధింపులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిఎం శివశ్రీ, మళ్ల నాగమణి, కె.భారతి, ఎం.సంధ్యారాణి, కె.ప్రమీల, బి.ఈశ్వరి, కె.సోమేశ్వరి పాల్గొన్నారు.

రాంబిల్లి : ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం ఆధ్వర్యాన మండలంలోని రాంబిల్లి యాతపేట, కొత్తపేట గ్రామాల్లో ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి.భవాని, బి పద్మ, బి నూకరత్నం, పి వెంకటలక్ష్మి, వందలపు వరాలు, టి పైడమ్మ, టి రత్నం, దేవి, రాజశ్రీ, సత్యవతి పాల్గొన్నారు.

కశింకోట : ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కశింకోటలో ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా నాయకులు డిడి.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల మీద రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయన్నారు. పసిపిల్లలు, వృద్ధులు అన్న తేడా లేకుండా అందరిపైనా లైంగిక వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగమణి, ఏం స్వప్న, ఏ పుష్ప, డి రేవతి, విఎల్ సింధుజ, ఎంబివి లక్ష్మి, ఏ ప్రవీణ, ఏకే సత్యవతి, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో జెండా ఆవిష్కరణ చేశారు. మూలపేటలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు డిడి.వరలక్ష్మి, యు నాగమణి, బి నాగలక్ష్మి, ఆర్ వరలక్ష్మి, పి ధనలక్ష్మి, జగదీశ్వరి, నూకరత్నం, పి సత్య, ఈ వెంకటలక్ష్మి, ఎం వరలక్ష్మి, ఎం మంగ, జైదుర్గ, పి పైడ్రాజు, పోలా పాల్గొన్నారు.



యలమంచిలిలో నినాదాలు చేస్తున్న మహిళలు

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి సీతయ్యపేట, పెదపూడి పంగిడి గొర్లెపాలెం గ్రామాల్లో కేంద్ర పారా మిలిటరీ బలగాలతో బుచ్చయ్యపేట పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై డి ఈశ్వరరావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తకోట సిఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి రూరల్ సీఐ ధనుంజయ్, జి.తేజేశ్వరరావు, ఆధ్వర్యాన అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌలువాడ, మామిడిపాలెం, మాకవరం, మార్టూరు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు.

చంద్రబాబు ఇంటికి తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి టికెట్‌ను టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆ నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు 100 కార్లతో మంగళవారం ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటికి తరలి వెళ్లారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో నాలుగు మండలాలకు చెందిన ముఖ్యమైన కార్యకర్తలు రోడ్డుపై వారి ఆవేశం వెళ్లగెక్కారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రగడ నాగేశ్వరరావు ముఖాముఖిగా కలిసి చర్చిలు జరిపినట్లు తెలిసింది.

రూ.26 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -అనకాపల్లి : తుమ్మపాల మేజర్ గ్రామపంచాయతీ పరిధి ఇందిర నగర్‌లో బంగారు వెంకటేశ్వరరావు ఇంటిదగ్గర సీసీ రోడ్డు, కళ్యాణ మండపం రిపేర్లకు మండల పరిషత్తు నిధుల నుండి రూ.10 లక్షలు ఎంపీపీ మంజూరు చేయగా ఆ పనులను, 15వ ఆర్థిక సంఘం నుండి రూ.16 లక్షలతో ఇందిరానగర్ మెయిన్ రోడ్ నుండి పెద్ద కాలువ మదుము వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష- 2లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మధరావు, సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామ జోగినాయుడు, వైద్యులు సుధారాణి, లీల పాల్, ప్రవళిక, వెంకట్రావు, డిపిఎం జగదీష్, గ్రామ కార్యదర్శి శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని సూదివలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లంకవానిపాలెం పిహెచ్‌సి వైద్య సిబ్బంది నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ నందకిషోర్, రాజీవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా వారణాసి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దోసూరు గ్రామానికి చెందిన సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ప్రముఖ న్యాయవాది వారణాసి వెంకట జోగయ్య మంగళవారం దేవస్థానం ఇఒ మురళి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా గండి అప్పలనాయుడు, డైరెక్టర్లుగా గొర్రె ప్రసన్నకుమార్, మట్ట ఈశ్వరమ్మ, జల్లూరి వరహాలు, చీపురుపల్లి సన్యాసమ్మ, పెదపాటి రాజి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ లోగా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారి ఫోన్ నెంబర్లకు మెసేజ్ రూపంలో సమాచారం అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్టిపి టోల్ ఫ్రీ నెంబర్ 18004258599కు సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు చేసే విద్యార్థిని కుటుంబ ఆదాయం పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షల లోపు ఉండాలని సూచించారు.



రైతులు, కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

14న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎం జగన్నాథపురం గ్రామంలో మంగళవారం రైతులు, ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించి చలో ఢిల్లీ కార్యక్రమం ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఏడాది పాటు ఢిల్లీలో రైతుల చేసిన పోరాటానికి దిగొచ్చిన మోడీ, రైతులకు న్యాయం చేస్తామని 2021 డిసెంబర్‌లో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఆ హామీలను అమలు చేయాలని ఢిల్లీ బయలుదేరి వెళ్లిన రైతాంగాన్ని హర్యానా సరిహద్దుల్లో అడ్డగించి నిర్బంధించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు ఆర్. రాము, కే.రామ సదాశివరావు, కాశి రమణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఈ నెల 14న చలో ఢిల్లీకి మద్దతుగా జిల్లా, మండల కేంద్రాలలో జరుగు నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు పిలుపునిచ్చారు. మండలంలోని 10 గ్రామాలలో మంగళవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, సుఖ సత్యవతి పాల్గొన్నారు.

ఫిట్స్‌తో కుమార్తె మృతి

తట్టుకోలేక తల్లి గుండెపోటుతో మరణం

ప్రజాశక్తి-దేవరాపల్లి : 18 ఏళ్ల కుమార్తె కళ్ళ ముందే ఫిట్స్‌తో గిలగిలా కొట్టుకొని మరణించడంతో, అది చూసి తట్టుకోలేక గుండెపోటుతో తల్లి కుప్పకూలి మరణించిన సంఘటన స్థానికులను కలచివేసింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని అపార్ట్మెంట్‌లో రిటైర్డ్ ఉద్యోగి నిమ్మకాయల శ్రీనివాసరావు, భార్య ఉషారాణి(51), కుమార్తె సాయి మేఘన(18) నివాసముంటున్నారు. సాయి మేఘన ఫిట్స్ వ్యాధితో కొంతకాలం నుంచి బాధపడుతుంది. మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ తీవ్రస్థాయిలో వచ్చి తల్లి ముందే గిలగిల కొట్టుకొని మృతి చెందింది. తన కుమార్తె మృతదేహం వద్ద కూర్చొని కుమార్తె మరణ విషయం దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులకు ఫోన్లో తెలియజేస్తూ తల్లి ఉషారాణి గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలి మరణించింది. దీంతో శ్రీనివాసరావు బోరున విలపించారు. ఈ హృదయ విదారకరమైన ఘటనను చూసి స్థానికులు కంటతడి పెట్టారు.



కుమార్తె, భార్య మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధిలో రూ.5.67 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, రూ.కోట్ల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించామని, రోడ్లు, డ్రెయినేజీలు, పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. జగ్గు జంక్షన్ కూడలి విస్తరణ, వంద అడుగుల రోడ్డు ఆధునికీకరణ, విద్యానగర్ కల్వర్టు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, సభ్యులు బోసేష్, వి.బలరాం, సాలాపు రామారావు, వి.సత్యనారాయణ, నీలకంఠం, డిప్యూటీ ఇఇ ఎంఆర్ఎస్.అప్పారావు, సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్, కాలనీ వాసులు దొడ్డి సత్యారావు, నీలకంఠం, మస్తరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీల పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి కోట నరవలోని డ్రెయినేజీ వ్యవస్థను మంగళవారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఒక్క అవకాశమివ్వమని వచ్చిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తనకేమీ తెలియనట్టు, ఈ కార్యకర్తల కోసమే పనిచేసుకుంటున్నారని ఆరోపించారు. కోట నరవ వద్ద అపార్ట్‌మెంట్ నిర్మించి, అవుట్‌లెట్లు నిర్మించకపోవడంతో వచ్చిన మురుగు నీరంతా వచ్చిన నిల్వ చేరుతోందన్నారు. దీనిపై పలుమార్లు జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాని పట్టించుకోలేదన్నారు. ఈ మురుగు నీటిలో ప్రబలుతున్న దోమల వల్ల డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇటువంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

పైనాపిల్ కాలనీలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పాత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన మంగళవారం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా పైనాపిల్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, తురకపూడి బాలస్వామి, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మి, యల్లమిల్లి సురేష్, భవిరీడు, కాశీ, నూర్జహాన్, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుఐడి డైరెక్టర్‌గా వెంకటలక్ష్మి



వెంకటలక్ష్మి కనకరాజు దంపతులను అభినందిస్తున్న చైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎపిడబ్ల్యుఐడి డైరెక్టర్‌గా రెండోసారి 10వ వార్డుకు చెందిన పతివాడ వెంకటలక్ష్మితో ఆ సంస్థ చైర్మన్ యనమల నాగార్జున సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. రెండో సారి పదవి అప్పగించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, వైవి.సుబ్బారెడ్డికి, ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు, నగర అధ్యక్షులు కోలా గురువులుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యాచరణలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటుచేసినట్లు ఆ పార్టీల నాయకులు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని టిడిపి వార్డు అధ్యక్షులు, విశాఖ పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఇఎన్ఎస్ చంద్రరావు, జనసేన వార్డు అధ్యక్షులు సంతోష్ నాయుడు పిలుపునిచ్చారు.

సామాజిక భవనమా? కల్యాణమండపమా?

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో ఏడు వార్డులకు సంబంధించిన యాదవ కులస్తుల కోసం నిర్మించిన సామాజిక భవనం ఎవరి కోసం ఉపయోగపడుతుందో అర్థం కాని పరిస్థితుల్లో యాదవులు ఉన్నారు. ఆ భవనంపై వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ భర్త పుర్రె సురేష్ యాదవ్ బావ, ప్రియాంక సప్లయర్స్ యజమాని ఆయన వెంకటరమణ పెత్తనం సాగుతోంది. సామాజిక భవనాన్ని ప్రియాంక సప్లయర్స్ సామాన్లతో నింపి, కల్యాణ మండపంగా అద్దెకిస్తూ వాడుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇది యాదవ కులస్తుల సామాజిక భవనమా? లేక ప్రియాంక సప్లయర్స్ యజమాని భవనమా అంటూ మండిపడుతున్నారు.

జివిఎంసి 59వ వార్డు పరిధి గాజువాక డిపో సమీపంలో ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న ఐదు సెంట్ల స్థలంలో యాదవ సామాజిక భవనాన్ని నిర్మిస్తే బాగుంటుందని వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ భర్త సురేష్‌యాదవ్ భావించి పథకాన్ని అమలులోకి తెచ్చారు. వెంటనే పారిశ్రామిక ప్రాంతంలోని యాదవులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ యాదవ సామాజిక భవనం నిర్మిస్తే మనందరికీ ఉపయోగపడుతుందని వారిని నమ్మించారు. దీంతో వారంతా ముందుకొచ్చి అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి యాదవ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని, నిర్మాణానికి నిధులు సమకూర్చాలని కోరారు. వారి వినతుల మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ వారికి స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే నిధులను కేటాయించారు. దీంతో యాదవ సామాజిక భవనం నిర్మాణం పూర్తిచేసుకుంది. గోకుల యాదవ సామాజిక భవనం అని నామకరణం చేసి భవనాన్ని ప్రారంభించారు. భవనం ప్రారంభం కావడంతో యాదవ సామాజిక వర్గ సమావేశాలకు ఉపయోగపడుతుందని అందరూ సంబరపడిపోయారు. కానీ ఆ భవనం కాస్తా కల్యాణమండపంగా మారిపోయింది. ఈ కల్యాణ మండపాన్ని ప్రియాంక సప్లయర్స్ యజమాని వెంకటరమణ తన గుప్పిట్లో పెట్టుకున్నారు. భవనాన్ని అద్దెకిచ్చి దానిపై వచ్చిన డబ్బును ఎవరి సంక్షేమానికి ఉపయోగిస్తున్నారో యాదవ సామాజిక వర్గానికి సమాధానం కూడా చెప్పడంలేదు.

నిజానికి పారిశ్రామిక ప్రాంత యాదవుల కోసం నిర్మించిన సామాజిక భవనం కాబట్టి దాన్ని పర్యవేక్షణకు ఓ కమిటీని వేయాల్సి ఉంది. ఐదేళ్లు దాటినా నేటికీ కూడా కమిటీని వేయలేదు. దీనిపై పలువురు యాదవ సోదరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, ప్రస్తుత వైసిపి పాలకులకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. ఇప్పటికైనా దీనిపై ఓ కమిటీ వెయ్యాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.


కల్యాణ మండపంలా వాడుతున్న యాదవుల సామాజిక భవనం

'ఇందువతమ్మ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం'



పరీక్ష మెటీరియల్‌ను అందిస్తున్న గొండు సీతారాం, పప్పల రామ్మోహన్

ప్రజాశక్తి-సీతమ్మధార : తమ్మినేని ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. ఈ నెలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న రెండు వేలమంది విద్యార్థులకు ట్రస్టు సమకూర్చిన పరీక్ష అట్టలు, మెటీరియల్‌ను అక్కయ్యపాలెంలోని ఎన్జీజీవో కాలనీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో మంగళవారం గొండు సీతారాంతోపాటు అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాతృమూర్తి తమ్మినేని ఇందువతమ్మ పేరిట శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ప్రారంభమైన చారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తృతమయ్యాయన్నారు. పేద పిల్లల విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ నిర్వాహకులు తమ్మినేని సీతారాం, వాణి దంపతులు విశాఖ నగరంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. పప్పల రామ్మోహన్ మాట్లాడుతూ, పదోతరగతి విద్యార్థులు చక్కని ప్రతిభను కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరస, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

చేయూత చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 1, 2, 3 వార్డుల్లో ఉన్న స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,778 మంది సభ్యులకు చేయూత పథకం కింద రూ.15 కోట్లు 48 లక్షలా 93 వేలా 750 చెక్కును భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ పాలనలో నవరత్నాలు పేరుతో అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కూటములు కట్టినా అంతిమ విజయం వైసిపిదే అని జోస్యం చెప్పారు.

ఇదే వేదికపై ముందుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వైసిపి ప్రభుత్వం రేషన్ కార్డు మొదలు ఇంటి పట్టా వరకూ మహిళల పేరున ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీని ఎమ్మెల్యే ముత్తంశెట్టి సత్కరించారు. జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతితో పాటు మరికొందరు మహిళలను ఝాన్సీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పి.బాలరాజు, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, యుసిడి ఎపిడి సంతోష్ కుమార్, వైసిపి నాయకుడు ముత్తంశెట్టి శివ నందీష్, మాజీ కౌన్సిలర్లు జగుపల్లి ప్రసాద్, ఉప్పాడ నాగేశ్వరరావు, జివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అంశం మ్యానిఫెస్టోలో ఉండేలా ఒత్తిడి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా చూస్తామని అన్ని పార్టీలూ తమ మేనిఫెస్టోలో పెట్టేలా ఒత్తిడి తేవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 1125వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉక్కునగరంలోని త్రిష్ణా మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో విజయం లభిస్తుందని సంకేతం వెళ్తే విజయం సాధిస్తామని చెప్పారు.

ప్రకృతితోనే కళాకారునికి స్ఫూర్తి

ప్రజాశక్తి -ములగాడ : ప్రకృతిని చూసి ప్రతి కళాకారుడూ ఉత్తేజితుడవుతాడని, తన సృజనాత్మకతను ప్రదర్శిస్తాడని ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్ పేర్కొన్నారు. స్థానిక క్రాంతినగర్‌లోని సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో మంగళవారం ఆయన మాట్లాడారు. చిత్రలేఖనంలో ప్రతి రంగుకూ ఒక అర్థం ఉందన్నారు. పరిశీలన, అనుకరణ నూతన విషయాల సృష్టికి ఎంతో అవసరమని చెప్పారు. చిత్రలేఖనంలోని మెళకువలను వివరించారు. పాత్రికేయులు ఎస్.చలపతిరావు మాట్లాడుతూ, పత్రికలు చదవకపోతే దేశం పట్ల అవగాహన ఉండదని పేర్కొన్నారు. యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సంస్కరణలపై జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యూనిట్ -3 ఆధ్వర్యాన త్రినాధపురంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో మంగళవారం బృంద చర్చలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళలు- రిజర్వేషన్లు అనే అంశంపై ప్రోగ్రాం అధికారి వి.అంజలీదేవి ప్రసంగించారు. ప్రకాష్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యాన ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ రీజనల్ సెక్రటరీ వెంకట్రావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ రోజూ గ్రంథాలయాలను సందర్శించి, సక్రమంగా ఉపయోగించుకుంటే విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం సులభతరం అవుతుందని అన్నారు. అనంతరం 50 మంది వాలంటీర్లు గ్రంథాలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించి, పుస్తకాలను పరిశుభ్రంగా, వరుసక్రమంలో ఉంచారు. జాతీయ సేవాపథక కార్యక్రమాలపై సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, రచయిత కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మాధవధార : ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డు కార్యాలయాన్ని నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ముందుగా బిర్లా జంక్షన్‌లోని ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీగా మురళీనగర్ చేరుకొని వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం టిడిపి నాయకులు సనపల వరప్రసాద్ నేతృత్వంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూన వెంకట్రావు, సనపల రామకృష్ణ, అప్పలకొండ యాదవ్, పృథ్వీరాజ్, పెంటకోట త్రినాథ్, తటినేని శ్రీనివాసరావు, స్రవంతి కుట్టా, పరశురామ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాసలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి పాత కరాసలో ఆడారి తులసీరావు ట్రస్టు ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ ప్రారంభించారు. 300 మందికి పైగా కంటి వైద్య పరీక్షలను వైద్యులు నిర్వహించారు. వారిలో సుమారు 50 మందికిపైగా ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లుచేశారు. మరొక 50 మందికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, జియ్యాని మారుతీ, శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో దళితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, వేములవలస పంచాయతీలో జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపులో దళితులకు న్యాయం చేయాలని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు డిమాండ్ చేశారు. వేములవలస పంచాయతీలో ఇళ్ల స్థలాల కేటాయింపులో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి అర్హులైన దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

శ్రీప్రకాష్ విద్యార్థులకు యంగ్ జీనియస్ అవార్డులు


అవార్డుకు ఎంపికైన నవీన్‌హర్ష, దేదీప్య.

ప్రజాశక్తి- పాయకరావుపేట : సుచిర్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్రస్థాయిలో జనరల్ నాలెడ్జ్, గణితం, సైన్స్ విభాగాలలో నిర్వహించిన 31వ సివి.రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తాచాటారు. ఆరవ తరగతి విద్యార్థిని ఎం. దేదీప్య, ఐదో తరగతి విద్యార్థి ఇ.నవీన్ హర్ష రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి యంగ్ జీనియస్ అవార్డులు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సివాచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. వీరితోపాటు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో టి. గ్రీష్మశ్రీ, డి. విఖ్యాత్, ఎస్.కౌషల్ కార్తికేయ, జి.లిఖిత్, కె.గిరిచరణ్, ద్వితీయస్థానంలో ఎ. సాత్విక, ఎ.జయంత్, ఆర్. లలిత (10 వ తరగతి) నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వచ్చేనెల 4న హైదరాబాద్ శ్రీసత్యసాయి నిగమాగమంలో జరిగే కార్యక్రమంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, నగదు బహుమతి అందచేస్తారన్నారు విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి- గొలుగొండ : మండలంలోని రావణాపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న కాలనీ లబ్ధిదారులకు పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లు బైరాగి, కొల్లు రాము, కొల్లు గంగునాయుడు, కొల్లు లోవరాజు, విఆర్ఓ కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : మాకవరపాలెం మండలం తామరం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి లక్ష్మి, సర్పంచ్ చెల్లారత్నం మాట్లాడుతూ వైసిపి హయాంలోనే పేదల సొంతింటి కల సాకారమైందన్నారు. అర్హత గల వారందరికి ఇళ్ల పట్టాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, కార్యదర్శి బాలదొర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉధృతం

సిఐటియు జిల్లా కోశాధికారి వివి. శ్రీనివాసరావు


సమావేశంలో పాల్గొన్న సిఐటియు నేతలు ,కార్మికులు

ప్రజాశక్తి- నక్కపల్లి : కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం నక్కపల్లిలో నూకాలమ్మ గుడి ఆవరణలో సిఐటియు నాయకులు ఎం రాజేష్ అధ్యక్షతన యూనియన్ మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు అనకాపల్లి జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి వరలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక పెరుగుతున్న ధరలతో తమ కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. అనేక రంగాల్లో కార్మికులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించక పోవడంతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఇటీవల అంగన్వాడీ ఉద్యమ నేపథ్యంలో సమ్మె జీతాలను ఇస్తానన్న ప్రభుత్వం నేటికీ స్పందించలేదన్నారు. ఆశాలకు పని భారం పెరిగిందని, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంపు హామీ నేటికీ నెరవేరలేదని, పంచాయతీ కార్మికులకు నెలలు తరబడి జీతాలు రాక ఇబ్బందులు పడతున్నారన్నారు. కార్మికుల సమస్యలపై సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలు, పోరాటాలు నిర్వహించి, కొన్ని డిమాండ్లు సాధించిందన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు ఎం. దుర్గా రాణీ, ఆశా యూనియన్ నాయకులు వరలక్ష్మి, లక్ష్మి, ఐకెపి నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, నాగమణి, మిడ్ డే మీల్ నాయకులు ఎన్ నారాయణరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఆర్‌డబ్ల్యుఎస్ యూనియన్ నాయకులు, సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : మాకవరపాలెం మండలంలోని వజ్రగడలో రూ.కోటి 8 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో సచివాలయ, రైతు భరోసా, హెల్త్ క్లినిక్, పశువైద్య కేంద్రంతోపాటు కమ్యూనిటీ భవనాలను ఎంపిపి సత్యనారాయణ, వైసీపీ అధ్యక్షుడు వాసు, సర్పంచ్ వెంకట గౌరీలక్ష్మీతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో వజ్రగడ మాజీ సర్పంచ్ త్రినాథ్, నేతలు బొడ్డు గోవింద, పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ, చిటికెల రమణ, జె.కె.రాజు, ఎంపీడీవో చంద్ర రావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


పారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

బాల్యవివాహాల అనర్థాలపై
విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం హైస్కూల్‌లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ సత్య బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. కౌమార దశలో జరిగే మార్పులపై వివరించారు. బాలికలు ఉన్నతవిద్యను అభ్యసించి, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, రాఘవ, అంగన్వాడీ కార్యకర్త మంగతాయి పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాకలపాడు గ్రామంలో మంగళవారం నవధాన్యాలు సాగు నేలతల్లి బాగు అనే కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ దేవుళ్లు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.క్యాక్రమంలో గొల్లు మాణిక్యం, ఎస్ఆర్‌పి దేవుళ్లు, ఎంటి కె.వరలక్ష్మీ, అప్పారావు, నూకరత్నం పాల్గొన్నారు.

పోరాటాలతోనే శ్రామిక మహిళా హక్కుల పరిరక్షణ


నినదిస్తున్న శ్రామిక మహిళలు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : పోరాటాలతోనే మహిళ హక్కులు కాపాడుకోగలమని యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి. గాయత్రి అన్నారు. మంగళవారం నర్సీపట్నం సిఐటియు కార్యాలయం వద్ద ఐద్వా, యుటిఎఫ్ సీఐటీయూ అధ్వరంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా వారోత్సవాల్లో భాగంగా శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు కె ప్రసన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, అనేక మంది సంఘ సంస్కర్తలు, పోరాటయోధుల పోరాడి సాధించుకున్న ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.గౌరీ, కేవీ సూర్యప్రభ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆర్థిక, సామాజిక అసమానతలకు మహిళలు గురవుతున్నారని, సాంప్రదాయాలు పేరుతో వివక్షత కొనసాగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. . కెవిపీయస్ జిల్లా ప్రధాన ఈరెల్లి చిరంజీవి మట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనలో మహిళలకు దాడులు, వేధింపులు పెరిగిపోయాయని, వివక్షత కొనసాగుతోందన్నారు. రాజ్యాంగ కల్పించిన హక్కులు నేటికీ మహిళలకు అందడం లేదన్నారు. బిజెపితోపాటు వాటిని సమర్థించే పార్టీలను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నేత అరుణ, భోజన సంఘం నేత జగది, అంగన్‌వాడి నాయకులు వెంకట లక్ష్మి, విజయ, లోవకుమారి, కాఫీ కార్మిక సంఘం నేత నూకరత్నం పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నిధుల కోసం వైసిపి కౌన్సిలర్లతో హడావిడిగా తీర్మానం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవికుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు మున్సిపాలిటీ ఆమోదం కోసం నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి టిడిపి, జనసేన కౌన్సిలర్లు, హాజరు కాలేదు. వైసిపి కౌన్సిలర్లతోనే సమావేశాన్ని నిర్వహించి, బిల్లులకు సంబంధించి నిధుల కోసం తీర్మానం చేశారు. సమావేశం ప్రారంభమైన వెంటనే 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి మాట్లాడుతూ అత్యవసర సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారో సమగ్రమైన సమాచారం ఇవ్వాల్సిన అవసరం కమిషనర్‌కు ఉందన్నారు. విపక్ష కౌన్సిలర్లు లేకుండా సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ మారిన ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా నిధులు విడుదలకు మున్సిపాలిటీ కౌన్సిల్ ఆమోదంతో తీర్మానం కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో సమావేశం నిర్వహించామన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి -నక్కపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి జగన్ ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మినీ హాకీ గ్రౌండ్ ఏర్పాటుకు స్పోర్ట్స్ అథారిటీ సెస్ నుండి రూ.కోటి 60 లక్షలు నిధులు మంజూరుకాగా, ఆయా పనులకు శంకుస్థాపన చేశారు. రాష్టంలో ఆస్ట్రోటర్ఫ్ మినీ కోర్ట్ నక్కపల్లిలో మూడవదన్నారు. నక్కపల్లిలో మినీ హాకీ కోర్ట్ ఏర్పాటుతో గ్రామీణ క్రీడాకారుల శిక్షణకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంపిపి సర్పంచ్ జయ రత్నకుమారి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మినీ కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, హెచ్ఎం రాణి లలిత, వైస్ ఎంపిపిలు నానాజీ ,ఈశ్వరరావు, హాకీ కోచ్ రాంబాబు ,బిఎస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, ప్రధాన కార్యదర్శి తాతాజీ పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - అరకులోయ : మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని చొంపి, నందివలస, మాదగడ, పట్టగూడ, జనంగూడ, బోసుబెద, పాగిరంగిని తదితర 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.కొన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుద్దీకరణ సదుపాయం లేకపోవడంతో వెంటనే చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇరువాడలో గెడ్డ స్థలం ఆక్రమణపై కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలోని సబ్బవరం మండలం ఇరువాడ పంచాయితీలో సర్వే నెంబరు 103, 106లలో సుమారు 3 ఎకరాలు గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారని, దానిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని, ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ స్థలాలు, గెడ్డ పోరంబోకు స్థలాలు, కొండలు ఆక్రమణకు గురవుతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వ భూములు రక్షించాల్సిన రెవెన్యూ సిబ్బంది ఉదాసీనంగా వుండడం వలనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో చుట్టు పక్కల భూముల విలువ పెరిగిందని, దీంతో వైసిపి నాయకులు, ల్యాండ్ మాఫియా కుమ్మక్కై భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇరువాడలో ఇదే తంతు జరిగిందన్నారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని ఇరువాడ పంచాయితీలో ఆక్రమణకు గురైన భూమిని పరిరక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తుమ్మపాల కార్మికులకు బకాయిలు విడుదల

ప్రజాశక్తి -అనకాపల్లి : తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం కొన్నేళ్ళుగా చెల్లించవలసిన జీతాల బకాయిలు రూ.5.18 కోట్లను మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం తన స్వగృహంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాధ్‌ని తుమ్మపాల ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్, పర్మినెంట్, దిన వేతన కార్మికులు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దంతులూరి దిలీప్ కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-కశింకోట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు అన్నారు. కశింకోట మహిళ సమాఖ్య కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎంపిపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజని, మహిళ సమాఖ్య అధ్యక్షులు వేపాడ లక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారి పార్వతిలను సత్కరించారు.

దేవరాపల్లి : మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజాభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక ఆర్డబ్ల్యుఎస్ సంఘం మహిళా సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

మురుగునీటితో దుర్గంధం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కల్లివానిపాలెం కాళింగుల కాలనీ ప్రజలు మురుగు నీటితో నిత్యం ఇబ్బంది పడుతున్నారు. భీమిలి క్రాస్ రోడ్ వద్దనున్న ఒక ప్రైవేట్ కళాశాల హాస్టల్ నుంచి వచ్చే పైప్ లైన్ డిజిపోయి మురుగు నీరు అంతా బయటకు ప్రవహిస్తోంది. దాని వల్ల మురుగు ఒకే చోట పేరుకుపోయింది. దోమలు ప్రబలుతున్నాయి. దీంతో కాలనీవాసులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మురుగునీరు పోయే ఏర్పాట్లుచేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాళింగుల కాలనీ సమీపంలో చేరిన మురుగు నీరు

ఎన్నికల కోడ్ పటిష్ట అమలుకు సహకరించండి

అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అల్లూరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయసునీత కోరారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా వచ్చే అవకాశం ఉందని, నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ పార్టీలకు చెందిన అంశాలు తొలగించాలని, 48 గంటల్లో పబ్లిక్ ప్రదేశాలలో, 72 గంటల్లో ప్రైవేట్ ప్రదేశాలలో తొలగింపులు జరగాలని వివరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల కమిషన్‌కు నివేదించి వారి ఆదేశాల మేరకు అదనపు భద్రతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడు నియోజకవర్గాలకు మూడు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు గుర్తించామన్నారు. అరకు నియోజక వర్గానికి సంబంధించి అరకు తహసిల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాడేరు నియోజకవర్గానికి సంబంధించి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రంపచోడవరం నియోజకవర్గానికి రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, తలారిసింగి (పాడేరు) ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జనవరి 22న తుది జాబితా ప్రకారం నాటికి 7,61,255 మంది ఓటర్లు ఉండగా సవరణలు, కొత్తగా నమోదైన ఓటర్లతో సోమవారం నాటికి ఆరు వేల వరకు పెరిగాయని, మరో 1300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పి.అంబేద్కర్, ఎన్నికల కోఆర్డినేషన్ పర్యవేక్షకులు అరుణకుమారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.బాలక్రిష్ణ, డి.కళ్యాణ్ (కాంగ్రెస్) కె.ఆనందరావు, ఎస్.త్రినాథ్ (బిజెపి) ఎస్.మంగన్న దొర(వైసిపి), కె.కృష్ణారావు (టిడిపి), ఎస్.అప్పారావు (బిఎస్పి), ఎం.వంశీకృష్ణ (ఆప్) పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను తొలి దశలోనే గుర్తించాలి

పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్

ప్రజాశక్తి- తగరపువలస : సీజనల్ వ్యాధులను తొలి దశలోనే గుర్తిస్తే తగిన శస్త్ర చికిత్స అందించవచ్చని, తద్వారా పాడి సంపదను రక్షించుకోవచ్చని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్ పాడి రైతులకు సూచించారు. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ, నిమ్మవానిపాలెంలో దివిస్ సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. చిప్పాడ, నిమ్మవానిపాలెం, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీలకు చెందిన 101 ఆవులు, 9 గేదెలు, 212 గొర్రెలు, 277 మేకలకు పశు వైద్యులు పరీక్షలు చేశారు. దివిస్ సహకారంతో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ మాట్లాడుతూ, వివిధ సందర్భాల్లో పశువులకు వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ గౌరీ ప్రశాంతి, దివిస్ సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వేములవలస పంచాయతీలో నిర్మించిన జగనన్న ఇళ్లలో దళితులకు అన్యాయం జరిగిందని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు ఆరోపించారు. వేములవలస సర్వేనెంబర్ 152లో జగనన్న ఇల్లు స్థలాలలో ఒక్క దళితుడికైనా పట్టా మంజూరు చేయలేదని పేర్కొన్నారు. లిస్టులో ఉన్న 89 పేర్లలో అగ్రవర్ణాలకు 13, మిగతా 76 మంది ఒకే సామాజిక వర్గానికి చెందిన వారని తెలిపారు. వేములవలసలో ఎస్‌సి కులస్తులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సుమారు 43 వేల ఓట్లు ఉన్న దళితులకు గ్రామాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీతాకోకచిలుక పద్యాల పోటీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నేషనల్ లెర్న్ అబౌట్ బటర్ ఫ్లై డేను పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో సీతాకోక చిలుకలపై పద్యాల పోటీ నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మంగళవారం తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి గల వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రాసే పద్యాలు సీతాకోక చిలుకల చుట్టూ కేంద్రీకృతమై ఉండాలని తెలిపారు. అలా రాసిన పద్యాలను, కథనాలను ఈ నెల 15వ తేదీ లోపు events.igzp@gmail.com మెయిల్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893632900, 9441130894 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వంగవీటి విగ్రహం ఏర్పాటు అడ్డగింత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పెదగదిలి కూడలి గ్రీన్ కారిడార్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహం ఏర్పాటుకు మంగళవారం కొంత మంది సన్నాహాలు చేస్తుండగా పెదగదిలి ఎస్‌సి కాలనీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు నిర్మిస్తున్న దిమ్మను, డెకింగ్‌ను తొలగించారు. దీంతో అక్కడ కొంతసేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. గతంలో ఇదే ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటే అనుమతి ఇవ్వలేదని, అలాంటిది ఇక్కడ వంగవీటి రంగా విగ్రహం ఎలా పెట్టనిస్తామని స్థానికులు ప్రశ్నించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి అక్కడకు చేరుకొని ఇరు గ్రూపులకు నచ్చజెప్పి పంపించేశారు.

నేరాలు ఘోరాలు

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : ఐరన్ స్క్రాప్ లోడుతో గుణుపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ పెందుర్తి సమీపంలోని పినగాడి వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ ఎన్.శేఖర్‌రెడ్డి (55) లారీలోనే మృతి చెందాడు. పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని పినగాడి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎడిసిపి శ్రీనివాసరావు కథనం ప్రకారం... పినగాడి సమీపంలో సరిపల్లికి వెళ్లే హైవే వంతెన కిందుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న విజయ్ (30) అదుపుతప్పి స్థానికులను ఢీకొంటూ వెళ్లి పక్కనే ఉన్న గోడను ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

25 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గొలుగొండ : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశామని కృష్ణదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. మంగళవారం కొయ్యూరు మండలం అంతాడ గ్రామానికి చెందిన వెలమ రాజుబాబు అనే వ్యక్తి 25 మద్యం క్వార్టర్ బాటిళ్లను పట్టుకొని వెళుతుండగా, కొంగసింగి జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశామన్నారు.

గీతంలో కృత్రిమ మేధపై సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన కృత్రిమ మేధపై ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్యాప్ జెమినీ సంస్థ సీనియర్ మేనేజర్ డాక్టర్ పూసపాటి రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కృత్రిమ మేధ ప్రస్తుతం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోందన్నారు. కృత్రిమ మేధ పనిచేసే విధానం, ఉపయోగాలు, చాటిజిపిటి గురించి వివరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధ ద్వారా భవిష్యత్తులో పెరుగునున్న అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎమ్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో పోలీస్ మార్చ్

ప్రజాశక్తి- ఆనందపురం : రాబోయే ఎన్నికలకు సంసిద్ధంలో భాగంగా ప్రత్యేక ఆర్‌పిఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యాన ప్రత్యేక బలగాలతో మండలంలోని బంటుపల్లి వారి కల్లాలు, సొంట్యాం, తర్లువాడ, గ్రామపంచాయతీ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న రెండు పోలింగ్ బూత్‌ల వద్ద కవాతు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం సబ్ ఇన్‌స్పెక్టర్లు గంట్యాడ సంతోష్, పందిరి శివ, ఎఎస్ఐ పైడిరాజు, పోలీస్ సిబ్బంది భద్రతా బలగాలు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ గంగా కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అనాధలు, బడి బయట ఉన్న వారు, మధ్యలో బడి మానేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సతీమణి నివేదిత తన కుమార్తె జన్మదినం సందర్భంగా మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు వంటి పరీక్ష సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగుపాము నాగేశ్వరరావు, హెచ్ఎం హెచ్‌బి.శ్రీధర్, ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, సుబ్బారావు, స్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న వాసుపల్లి

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేదవాడి సొంతింటి కల నిజం చేసిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం టర్నర్ చౌల్ట్రీలో జరిగిన కార్యక్రమంలో నియోజవర్గంలోని పేద ప్రజలకు ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

గండి బాబ్జీకి టికెట్ ఇస్తే గెలిపిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని నియోజవర్గం టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిషత్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వలిశెట్టి తాతాజీ మాట్లాడుతూ బాబ్జీ పేరు మొదటి జాబితాలో లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కేదార్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యాన ఉపకారవేతనాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గ్రేట్ స్కాలర్‌షిప్పులను ఈ ఏడాదికి సంబంధించి ఇవ్వనున్నట్లు సీనియర్ కన్సల్టెంట్ పలక్ సుఖుజా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, లాలో పీజీ స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. యూకేలో విద్యా అవకాశాలు, సాంస్కృతిక సంబంధాల కోసం బ్రిటిష్ కౌన్సిల్ అంతర్జాతీయ సంస్థ పనిచేస్తున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు https://www.britishcouncil.in/study-uk/scholarships/great-scholaraships ను సంప్రదించాలని కోరారు.

ఎపిలో రహదారుల అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిలో రూ.1.10 లక్షల కోట్లతో 40 ప్యాకేజీల కింద జాతీయ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టినట్టు బీజేపీ రాజ్యసభ సభ్యుడు సిఎం.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని లాసన్స్ బే కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్యాలయ అవరణలో బీజేపీ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు.

సమావేశ స్థలం పరిశీలన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోటలో బుధవారం జరగనున్న టీడీపీ, జనసేన, బిజెపి ఉమ్మడి విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించే స్థలాన్ని ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. వారి వెంట టిడిపి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, కాయల మురళి, పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

14న విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి- కశింకోట : మండల కేంద్రం కశింకోట ఆర్టీసీ బస్ స్టాప్ సమీపంలో ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య, మాజీ మంత్రి గుడివాడ గురునాధరావు విగ్రహాలను ఈ నెల 14న ఆవిష్కరించనున్నట్లు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ బివి.సత్యవతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

పలుచోట్ల వైసిపి ఆవిర్భావ దినోత్సవం

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, బూరెబాబు రావు, జడ్పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ, వైస్ ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి వైసిపి కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతలూరి దిలీప్ కుమార్, వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి, కశింకోట ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబు ఆధ్వర్యంలో జరిగిన వైసిపి 14వ ఆవిర్భావంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, వైసీపీ నేతలు బైలపూడి జయరాం, సబ్బవరపు నారాయణమూర్తి, సబ్బవరపు ముత్యాలనాయుడు, వడ్డాది అప్పలరాజు, కాపుశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్లె అనిల్ ప్రసాద్, బొడ్డేటి గంగరాజు, గురుకు ధర్మరాజు, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : వైసిపి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మండలంలోని కంఠారం గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని, పార్టీ పతకాన్ని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కొయ్యూరు మండల కేంద్రంలో వైయస్సార్ చేయూత చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, నూకాలమ్మ, ఏఎంసీ చైర్మన్ జయతి రాజులమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అరకులోయ : రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి విజయం తధ్యమని అరకు నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి అన్నారు. మంగళవారం అరకులోయలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. మిఠాయిలు ఒకరినొకరు తినిపించుకున్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసినివాళు లర్పించారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. అరకులోయలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అరకు వైసిపి సమన్వయకర్త రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, అరకు స్థానాల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కార్తికో అరుణకుమారి, శెట్టి అప్పాలు, జెడ్‌పిటిసి శెట్టి రోషిని, ఎంపిపి ఉషారాణి, సోమేశ్వరి,కమ్మిడి అశోక్ కుమార్, ఎ దురియా ఆనంద్ కుమార్ శత్రుఘ్న, రామ్మూర్తి, నోబో విజయ్ కుమార్, రహీం తుల్లా, రామన్న, లక్ష్మణ్, కొర్రా గాసి పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ మినిస్టేడియంలో .రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్ పర్సన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, జగనన్న సచివాలయాలు కన్వీనర్ తమరాన శ్రీను, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని



అరకులోయలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

జగదీశ్వరి పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు . రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపిపి నానాజీ, ఈశ్వరరావు ,నాయకులు కొప్పిశెట్టిహరి, మణిరాజు, పాపారావు, సాదిరెడ్డి శ్రీనివాసరావు, రాజు, ఎల్లేటి సత్యనారాయణ, బంగారాజు, కొండ పాల్గొన్నారు.

మధురవాడ : ఎండాడలోని విశాఖపట్నం వైసిపి కార్యాయంలో జెండాను ఎగురవేసి, కేక్ కటింగ్ చేపట్టారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విశాఖ లోక్‌సభ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయం వద్ద పార్టీ జెండాను సమన్వయకర్త కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కెవిఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో చీలిన కేడర్

గాజువాక : వైసిపి ఆవిర్భావ వేడుకల సందర్భంగా గాజువాకలో చేపట్టిన జెండా పండుగలో గ్రూపు రాజకీయం స్పష్టమైంది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణలో ఇద్దరు కార్పొరేటర్లతో పాటు 20 మంది కేడర్ మాత్రమే హాజరయ్యారు. ఇంతవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న తిప్పల దేవన్‌రెడ్డి కూడా హాజరయ్యారు. గాజువాక నియోజక వైసిపి అభ్యర్థి ఉరుకూటి చందు ఏర్పాటుచేసుకున్న పార్టీ కార్యాలయం వద్ద ఆయన జెండాను ఎగరవేశారు. ఆయనకు మద్దతుగా ఉన్న కొంతమంది కార్పొరేటర్లు, కేడర్ అక్కడికి వచ్చారు. గాజువాకలో రెండు గ్రూపులుగా చీలిపోయి పార్టీ జెండా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు గ్రూపులు గాజువాక అసెంబ్లీ టికెట్ తమదంటే తమదని చెప్పుకుంటూ గ్రూపులను ప్రోత్సహిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన తిప్పల వంశీరెడ్డి సిద్దేశ్వరం జంక్షన్లో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేస్తున్నారు. దీనికి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి ఝాన్సీ హాజరుకానున్నారు. ఈ వేదిక ద్వారా బలం చూపించి టికెట్ తెచ్చుకునేందుకు తిప్పల నాగిరెడ్డి ప్రయత్నిస్తున్నారు.



సన్యాసినాయుడుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

బ్యాడ్మింటన్ సింగిల్స్ విజేతగా సన్యాసి నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏన్యువల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ - 2024లో బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో మల్కాపురం సిఐ ఎన్.సన్యాసి నాయుడు విజేతగా నిలిచారు. ఈ పోటీల ముగింపు వేడుకలు పోలీస్ బేరక్స్‌లో జరగ్గా ముఖ్యఅతిథిగా విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ ఎం.అంగముత్తు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సన్యాసినాయుడు ప్రతిభను మెచ్చుకున్నారు.



వార్డులో పాదయాత్ర చేస్తున్న ఎంవివి.సత్యనారాయణ

ఇసుకతోటలో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర 59వ రోజుకు చేరుకుంది. మంగళవారం ఆయన ఇసుకతోట, కెఆర్ఎం.కాలనీ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. రాష్ట్రంలో జగన్ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ

ప్రజాశక్తి - పరవాడ : పరవాడలో పరదేశీమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు,చల్ల కనకారావు, బండారు రామరావు, వర్రి హరి, పైల సురేష్, వర్రి పైడంనాయుడు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని నరేంద్రపురం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని డెయిరీ మేనేజర్ కూండ్రుపు శేషు ప్రారంభించారు. హెరిటేజ్ డెయిరీ వైద్యుడు మనోజ్ కుమార్ 30 పాడి పశువులకు డి వార్మింగ్ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, ఎస్ మహేంద్ర, ఎస్ శ్యాము, సిహెచ్ హేమంత్, సిహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.